రహదారుల విస్తరణకు ప్రతిపాదనలు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- 88వ వార్డులో విస్తృత పర్యటన


అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

అగనంపూడి: దువ్వాడ సెక్టార్–1 కాలనీలో రహదారుల విస్తరణతో పాటు సీసీ డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జోనల్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశించారు. జీవీఎంసీ 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1, ఉప్పరకాలనీ, కొత్తూరు కాలనీ, ఇందిరానగర్, గంగవరం, నంగినారపాడు, సత్తివానిపాలెంలో మంగళవారం కమిషనర్ సంపత్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. దువ్వాడ వీఎస్ఈజెడ్ చుట్టూ ఉన్న ప్రహరీలో మార్పులు చేయాలని వీఎస్ఈజెడ్ డీసీకి లేఖ రాయాలని ఏసీపీ వెంకటరావును ఆదేశించారు. అలాగే కొత్తూరు నుంచి నంగినారపాడు పాఠశాల వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు సత్వరం పూర్తి చేయాలన్నారు. ఇందిరానగర్‌లో సీసీరోడ్లు, డ్రైనేజీలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వెదుళ్లనరవ నుంచి అనాథ ఆశ్రమం వరకు కల్వర్టుల నిర్మాణం పూర్తి చేసి రోడ్డు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గంగవరం రోడ్డులో విద్యుద్దీకరణ చేపట్టాలని సూచించారు. మంచి నీటి సమస్యను సత్వరం పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, ఈఈ శేషాద్రి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో పోస్టుకార్డు ఉద్యమం


పోస్టుకార్డు ఉద్యమంలో ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఉక్కు ఉద్యోగులు మంగళవారం స్టీల్‌ప్లాంట్‌లో పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీకు 10 లక్షల పోస్టు కార్డులు పంపాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్లాంట్‌లోని అన్ని విభాగాల్లో కార్మికులు పోస్టు కార్డులపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ అనేక ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడాన్ని నిరసిస్తూ చేస్తున్న ఉద్యమాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందన్నారు. ఆయా విభాగాల కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే జీవితం చిత్తు

డీఎస్పీ సత్యనారాయణ


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

అగనంపూడి: విద్యార్థులు, యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవించడం యువత ఫ్యాషన్‌గా భావిస్తూ దానికి బానిసలుగా మారి జీవితాలను అర్ధాంతరంగా ముగిసిపోవడానికి కారణమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. 85వ వార్డు లంకెలపాలెం సమీపంలోని నిస్ట్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో చదువును నిర్లక్ష్యం చేస్తూ సరదా కోసం మొదలు పెట్టి చివరికి బానిసలుగా మారుతూ దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారన్నారు. మత్తులో దొంగతనాలు, హత్యలు, దోపిడీలకు పాల్పడుతున్నారని వివరించారు. అంతేకాకుండా సులభంగా డబ్బు సంపాదించాలనే ఆత్యాశతో గంజాయి అక్రమ వ్యాపారం, రవాణాలో భాగస్వాములుగా మారుతుండడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పరవాడ సీఐ మల్లికార్జునరావు, నిస్ట్ కళాశాల ప్రిన్సిపాల్ హనీఫ్, హైటెక్ ఐటీసీ ప్రిన్సిపాల్ దుర్గునాయుడు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సౌత్ ట్రాఫిక్ సీఐ వెంకటరావు

అగనంపూడి: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సౌత్ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు అన్నారు. కూర్మన్నపాలెంలోని సౌత్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం మోటార్ మెకానిక్‌లు, ఆటోమొబైల్ దుకాణదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై వాహనం నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. సైలెన్సర్లు మార్చితే వాహనదారులతో పాటు మెకానిక్‌లపై కేసులు పెడతామని హెచ్చరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

శివాశిష్‌కు అభినందన


జాతీయ పోటీలకు ఎంపికైన శివాశిష్‌తో ప్రిన్సిపాల్ విశాలాక్షి

ఉక్కునగరం: జాతీయ స్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీలకు ఉక్కునగరం లిటిల్ ఏంజిల్స్ పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి జి.చేతన్ శివాశిష్ ఎంపికయ్యాడు. ఈనెల 14 నుంచి 17 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ పోటీల్లో శివాశిష్ పాల్గొంటాడని ప్రిన్సిపాల్ విశాలాక్షి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ఆ విద్యార్థిని అభినందించారు. జాతీయ పోటీల్లో కూడా పతకాలు గెలుపొందాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ అరుంధతి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పెదగంట్యాడ: ఈ నెల 14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నామని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయ అధికారి పీవీ రమణ తెలిపారు. 14న ఉదయం 10 గంటలకు వారోత్సవాలను ప్రారంభించనున్నామని చెప్పారు. ఈ సందర్భంగా భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని నివాళులర్పించనున్నామన్నారు. 15న విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు, పుస్తక ప్రదర్శన ఉంటాయన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమ నాయకులను స్మరించుకోవడం, అలాగే విద్యార్థులకు చదవడం మాకిష్టం, సెల్‌ఫోన్ వద్దు, పుస్తకం ముద్దు అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని వివరించారు. 17న కవి సమ్మేళనం, 18న క్విజ్ పోటీలు, 19న ముగ్గుల పోటీలు, ఇందిరా గాంధీ జయంతి వేడుకలు, 20న ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

నార సంచుల పంపిణీ


నార సంచులు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

అగనంపూడి: ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టి పర్యావరణాన్ని పరిరక్షించడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని సమాచార హక్కు చట్టం కార్యకర్తలు పట్టా రామ అప్పారావు, నిమ్మకూరి రమేష్ అన్నారు. జీవీఎంసీ 86వ వార్డు వుడా ఫేజ్–6లో మంగళవారం నిమ్మకూరి రమేష్ ఆర్థిక సాయంతో 200 మందికి నార సంచులు పంపిణీ చేశారు. పర్యావరణ హితం కోసం ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి గుడ్‌బై చెప్పాలన్నారు. కార్యక్రమంలో నిమ్మకూరి భానుమతి, హనోష్, మోనిక, సుజాత, కొరాయి కల్యాణి, రత్నం పాల్గొన్నారు.

మస్తానప్ప మృతి కార్మిక లోకానికి తీరని లోటు


మస్తానప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నాగిరెడ్డి, చింతలపూడి

పెదగంట్యాడ: వైఎస్సార్ టీయూసీ ప్రధాన కార్యదర్శి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వై.మస్తానప్ప మృతి కార్మిక లోకానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. వైఎస్సార్ టీయూసీ ఆధ్వర్యంలో మస్తానప్ప సంతాప సభను పెదగంట్యాడ జంక్షన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్ పీవీ సురేష్, వైఎస్సార్ టీయూసీ నగర అధ్యక్షుడు అనిల్ కుమార్, గొందేశి మహేశ్వరరెడ్డి, నక్క వెంకటరమణ, పిట్టా రెడ్డి, డీవీ రమణ, గొందేశి వెంకటరమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అండిబోయిన అప్పారావు, కల్పన పాల్గొన్నారు.

ఉక్కునగరం: కార్మికుల సంక్షేమానికి మస్తానప్ప చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు కొనియాడారు. మస్తానప్ప సంతాప సభను మంగళవారం స్టీల్ ప్లాంట్‌లోని యూనియన్ పాయింట్ వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్టారెడ్డి, విజయకుమార్, చంద్రశేఖర్, డి. పుల్లారావు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న హోంగార్డుపై దాడి

ఉక్కునగరం: విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై దాడి చేసిన సంఘటనపై స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు అందించిన వివరాలివి.. డిప్యుటేషన్‌పై స్టీల్‌ప్లాంట్‌లో హోంగార్డుగా పని చేస్తున్న నగిరెడ్డి వెంకట సన్యాసినాయుడు మంగళవారం బి షిఫ్ట్‌లో బీసీ గేటు పాయింట్‌లో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. అయితే భారత్ పెట్రోల్ బంక్ వెనుక టర్నింగ్ పాయింట్ వద్ద నడుపూరుకు చెందిన పాల శ్రీను, ఇద్దరు మహిళలు కనిపించారు. దీంతో వారిని అక్కడ నుంచి వెళ్లిపోవాలని కోరగా పాల శ్రీను హోంగార్డు షర్ట్ కాలర్ పట్టుకుని మొహంపై కొట్టాడు. దీంతో హోంగార్డు పడిపోగా పాల శ్రీను అక్కడ నుంచి బైక్‌పై వెళ్లిపోయాడు. హోంగార్డు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేశవరావు నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి బోర్ల ప్రారంభం


బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్టాలిన్ తదితరులు

గాజువాక: జీవీఎంసీ 72వ వార్డు పాతకర్ణవానిపాలెం, శ్రీనగర్‌లలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లను మంగళవారం వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో నీటి సమస్య తలెత్తకుండా బోర్లను ఏర్పాటు చేశామన్నారు. వార్డు పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత కల్పించామని, అందులో భాగంగానే రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను పూర్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, జనసేన నాయకుడు కరణం కనకారావు, స్థానిక నాయకులు సిరసపల్లి అప్పారావు, గొంతిన దేముడు, పెతకంశెట్టి జగన్ పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ టీవీ అందజేత

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి మంగళవారం వెంకోజీపాలేనికి చెందిన సీహెచ్.ఎం.రాజు, విజయలక్ష్మి దంపతులు 43 ఇంచీల ఎల్‌ఈడీ టీవీ అందజేశారు. ఈ సందర్భంగా దివ్యక్షేత్రం ట్రస్ట్ సభ్యులు దాతలను సత్కరించారు.

పర్యావరణ కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం


డీఈవో అప్పారావు నాయుడును సత్కరిస్తున్న ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఖగేశ్వరరావు

అగనంపూడి: పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టే ప్రతీ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. అనకాపల్లి డీఈవోగా బాధ్యతలు చేపట్టిన అప్పారావు నాయుడును మంగళవారం ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీఈవో పలు సూచనలు చేశారు. ఏపీఎన్‌జీసీ ఉద్దేశ్యం, లక్ష్యాలు వివరించడంతోపాటు పర్యావరణం, ప్లాస్టిక్ రహిత సమాజం, సేంద్రియ ఎరువులు, వ్యవసాయం వంటి అంశాల్లో అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులు నేరుగా పాల్గొనేలా చూడాలన్నారు. విద్యార్థుల పుట్టిన రోజుల సందర్భాల్లో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించడం, వాటి సంరక్షణ బాధ్యతలు, ఆ మొక్కలకు నామకరణం చేయడం అలవాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పరవాడ క్లస్టర్ కోఆర్డినేటర్ బి.అన్నాజీరావు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం పారిశుధ్య కార్మికులు


పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: ఇటీవల విజయవాడలో తుపాను కారణంగా ముంపునకు గురైన ప్రజలకు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చేసిన సేవలు ఎనలేనవని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దళ్లివానిపాలెం సామాజిక భవనం వద్ద పారిశుధ్య కార్మికులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపద సమయంలో మేమున్నామంటూ పారిశుధ్య కార్మికులు ఎంతగానో కష్టపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరిసింగరావు, నాయకులు వియ్యపు కొండబాబు, గంగరాజు, దువ్వ శ్రీను, వెంకటేష్, సచివాలయ సిబ్బంది నిశాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు పాలగుమ్మికి అభినందనల వెల్లువ


సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పాలగుమ్మి రాజారావు

పెదగంట్యాడ: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన పాలగుమ్మి రాజారావు విజయవాడలో నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (కెమిస్ట్రీ)గా పని చేస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న రాజారావు మాస్టారుకు అభినందనలు వెల్లువెత్తాయి.

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడిలో విద్యుత్ అవసరాలకు తగిన విధంగా విద్యుత్ సరఫరా జరగడం లేదని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అగనంపూడికి చెందిన నాయకులు ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్‌ను వినతిపత్రంలో కోరారు. ఎస్ఈగా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌ను ముందుగా సత్కరించి తర్వాత సమస్యలు వివరించారు. కార్యక్రమంలో నాయకులు బి.సత్యనారాయణ, బి.చందు, జి.పద్మ, ఆర్.శిరీష తదితరులు పాల్గొన్నారు.

చైతన్య విద్యార్థినులకు అబుల్ కలాం ఆజాద్ అవార్డులు


విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న అధ్యాపకులు

గాజువాక: స్థానిక చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అవార్డులు లభించాయి. దేశ తొలి విద్యా శాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవంలో విద్యార్థులకు ఈ అవార్డులు అందజేశారు. యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన బి.వై.రత్నం (ఎమ్మెస్సీ మ్యాథ్స్), పి.ఎస్.తనూజ (ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎస్.వి.యామిని (ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్)లకు పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి తదితరులు విద్యార్థులను అభినందించారు.

నృత్య కళాకారిణి చాతుర్యకి ఘన సత్కారం


చాతుర్యని సత్కరిస్తున్న సిద్ధార్థనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: భారత్ ఆర్ట్స్ అకాడమీ సారథ్యంతో అయోధ్యలో నిర్వహించిన రామ్‌లల్లా సంగీత నృత్యార్చనలో పాల్గొని నిర్వాహకులతో శభాష్ అనిపించుకున్న చిన్నారి చాతుర్యని మంగళవారం సిద్ధార్థనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు బలిరెడ్డి నాగేశ్వరరావు, సుహాసిని, ఆదిశేషయ్య, బెన్నం నాయుడు, టి. ప్రకాష్, శివరామకృష్ణ, వాసు, ఆశీర్వాదం, మోహనరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఏకాదశి పూజలు


తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి పోటెత్తిన భక్తులు


భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద విశేష అలంకరణతో ప్రసన్న వేంకటేశ్వరుడు


పూజలందుకున్న దయాల్‌నగర్ వేంకటేశ్వరస్వామి

అక్కిరెడ్డిపాలెం: కార్తీక ఏకాదశి పురస్కరించుకుని షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో, భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరుడి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం పరిసరాల్లో భక్తులు దీపారాధన చేపట్టారు. సుమారు 25 వేల మందికి పైగా వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు.

- భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు.

పెదగంట్యాడ: దయాల్‌నగర్ కొండపై వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఏకాదశి సందర్భంగా వేకువ జాము నుంచే భక్తులు తరలివచ్చారు. ప్రసన్న మూర్తిని కనులారా దర్శించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

- బాలచెరువు ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో, పెదగంట్యాడ శివాలయంలో వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు.


వుడాకాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

ఘనంగా నగర సంకీర్తన శత దినోత్సవం


భక్తులను సత్కరిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు

అగనంపూడి: శ్రీసత్య సాయిబాబా 99వ జయంత్యుత్సవాల సందర్భంగా అగనంపూడి సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో వంద రోజుల పాటు నగర సంకీర్తన చేపట్టిన సంకీర్తనా మండలి ప్రతినిధులను మంగళవారం సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుదే సుశీలా గజేంద్రరావు ఘనంగా సత్కరించారు. అనంపూడి సత్యసాయి భజన మండలి కన్వీనర్ విందుల పైడినాయుడు సారథ్యంలో అగనంపూడి, పరిసర కాలనీల్లో 100 రోజుల పాటు ఓంకారం, సుప్రభాతంతో మొదలై ప్రపంచ శాంతి కోసం హనుమాన్ చాలీసా, సాయి భక్తి గీతాలు ఆలపించారు. క్రమం తప్పకుండా వంద రోజుల పాటు సేవలు అందించిన మహిళా భక్తులు కొల్లి జయలక్ష్మి, లక్ష్మి, దాన బాల లక్ష్మీబాయిలను సత్కరించారు. కార్యక్రమంలో బి.వి.సుబ్బారావు, రామఅప్పారావు, పి.గోవిందరావు, ఎల్.వి.రామన్, వి.గిరిధర్, డాక్టర్ వి.వి.రామారావు పాల్గొన్నారు.